18వ
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
## ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
గురువారం,30 జనవరి 2025 8 పేజీలు

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

**- పట్టణంలోని 3 హెూటల్స్‌కు 100 స్టీల్ గ్లాసులు, ప్లేట్స్ పంపిణీ**




**భీమవరం,మేజర్‌న్యూస్:** ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరూ భాగ స్వాములు కావాలని,హెూటల్స్‌లో స్టీల్ గ్లాస్‌లు,ప్లేట్స్ మాత్రమే వాడాలని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో భీమవరంలోని మూడు హెూటల్స్ కు దాతల సహకారంతో 100 స్టీల్ గ్లాస్, 100 ప్లేట్స్, కప్పులను అందించారు. ఎస్టిఓ అల్లూరి రవివర్మ, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, వచ్చేనెల 1నుంచి సంపూర్ణంగా ప్లాస్టిక్ నిషేదం జరుగుతుందని, ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో స్టీల్ సామాగ్రిని ఉపయోగిస్తున్నారని అన్నారు. ప్రజల్లో కూడా

- తరువాయి 2లో..

### ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎన్నికకు

# నోటిఫికేషన్ జారీ

**- 3 నుండి 10 వరకు నామినేషన్లు స్వీకరణ**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** ఉమ్మడి పశ్చిమ,తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి, 3వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరుగుతుందని,10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని జిల్లా కలెక్టర్, ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఏర్పాటుచేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఉమ్మడి పశ్చిమ,తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ వివరాలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఉమ్మడిపశ్చిమ,తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేసిందన్నారు .ఫిబ్రవరి,3 వతేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడం జరుగుతుందని, ఫిబ్రవరి, 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందన్నారు. నామినేషన్ల పరిశీలన 11వ తేదీన జరుగుతుందని, 13వ తేదీలోగా నామినేషన్ల ఉపసంహరణ చేసుకోవచ్చున్నారు. ఫిబ్రవరి, 27వ తేదీ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని,ఓట్ల లెక్కింపు కార్యక్రమం మార్చ్,3వతేదీన జరుగుతుం దని, ఎన్నికల ప్రక్రియ మార్చి,8వతేదీన ముగుస్తుం దన్నారు. ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని ఏలూరు,పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి,అల్లూరి సీతారామరాజు, కోనసీమ,కాకినాడ జిల్లాల పరిధిలో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఏలూరు జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తారని, నామినేషన్ల స్వీకరణ నుండి ఓట్ల లెక్కింపు కార్యక్రమం వరకు ఎన్నికల ప్రక్రియ ఏలూరులో జరుగుతుందన్నారు. జనవరి, 29వ తేదీ నుండి ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాలలో ఎన్నికలకోడ్ అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల నిర్వహణకోసం 440 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడం జరిగిందని, 3లక్షల15వేల261 మంది

- తరువాయి 2లో..

### సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన

# కలెక్టర్,ఎమ్మెల్యే





**పెనుగొండ,మేజర్‌న్యూస్:** శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమంలో పాల్గొనేందుకు జనవరి 31న రాష్ట్ర ముఖ్యమంత్రి పెనుగొండ శ్రీ నగరేశ్వర, మహిషాసు రమర్దిని, శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంను సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధిం చిన ఏర్పాట్లలో భాగంగా తొలుత హెలిపాడ్ ప్రాంతాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఆచంట శాసనసభ్యులు పితాని సత్యనారాయణ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ,జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి సెక్యూరిటీ పర్యవేక్షకులు అడిషనల్ ఎస్పీ రమణ, తదితరులు పరిశీలించారు. పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు నందు జరుగుతున్న హెలిపాడ్ కాంక్రీట్ పనులను పరిశీలించి ఆర్అండ్‌బి అధికారులకు తగుసూచనలు చేశారు. అదే ప్రాంగణంలో ప్రముఖులు, అతిపెద్ద ప్రముఖులు రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసేందుకు ఏర్పాటు చేస్తున్న ఎల్-వన్,ఎల్-టు ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు.మార్కెట్ యార్డ్ ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని డిపిఓను ఆదేశించారు. అనంతరం శ్రీ నగరేశ్వర, మహిషాసురమర్దిని శ్రీ వాసవికన్యకా పరమేశ్వరి అమ్మ వారి దేవస్థానంను సందర్శించి నగరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం, ఆలయానికి ఆనుకుని ఉన్న నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో జనవరి 31న హెూమం నిర్వహించే ప్రాంతాన్ని సెక్యూరిటీ అధికారులతో కలిసి పరిశీలించి అధికా రులకు పలు సూచనలు చేశారు. ఆలయం లోని గోశాలను పరిశుభ్రంగా ఉంచి ముగ్గులతో అలంక రించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా దేవాదాయ శాఖ అధికారిని ఆదేశించారు. అనంతరం శ్రీ వాసవి శాంతి ధామ్ ఋషి గోత్ర సువర్ణమందిరాన్ని సందర్శించి ఆలయ ట్రస్టీ డాక్టర్ పిఎన్ గోవింద రాజులుతో శాంతి ధామ్‌లో నిర్వహించే కార్యక్రమా లపై చర్చించారు. దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్

- తరువాయి 2లో..

# ఐదు ఎకరాల మున్సిపల్ స్థలం ఏమైందంటూ సభ్యుల ధ్వజం





**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం 2014లో మున్సిపల్ నిధులతో వేముల దీవిలో కొనుగోలు చేసిన ఐదెకరాల స్థలం ఏమైనది అంటూ సభ్యులు కౌన్సిల్ సమావేశంలో ధ్వజమెత్తారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్ పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ అధ్యక్షతన ప్రారంభమైంది.ఈ సమావేశంలో వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని మాట్లాడుతూ మున్సిపల్ నిధులతో కొనుగోలు చేసిన స్థలం మున్సిపాలిటీ రికార్డులలో ఉన్నదా లేదా అని ప్రశ్నించారు. వేముల దీవిలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు కోసం 25 లక్షలతో ఆ స్థలం కొనుగోలు చేసినట్లు ఆయన తెలిపారు. ఇదే విషయమై కౌన్సిలర్లు కోటిపల్లి సురేష్, వైకేఎస్, గంగరాజు, వన్నెం రెడ్డి శ్రీనివాస్,పాలూరి బాబ్జి తదితరులు అధికారులు సమాధానం చెప్పాలని పట్టుపట్టారు. దీంతో కొద్దిసేపు సమావేశంలో గందరగోళం నెలకొంది. అధికారులు సరియైన సమాధానం చెప్పలేకపోవటంతో కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా పట్టణంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కు టెండర్ల పిలవకుండా పనులు ఎలా చేశారంటూ అధికారుల నిలదీశారు. చైర్ పర్సన్ శ్రీ వెంకటరమణ కూడా ఈ విషయం నాకు తెలియదని చెప్పడంతో ఈ పనులు ఎవరు చేశారు. ఎవరు చేయించారు అంటూ కౌన్సిలర్లు నిలదీశారు. ఎమ్మెల్యే చెప్పటం వల్ల చేశామని అధికారులు సమాధానం చెప్పారు. ఎవరు చెప్పినప్పటికీ నిబంధనలు పాటించకుండా చేయటం సరైన పద్ధతి కాదని కౌన్సిలర్లు అన్నారు. జనసేన కౌన్సిలర్ భారతి సురేష్ మాట్లాడుతూ తమ వార్డులో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని గతంలో తెలిపినప్పటికీ చర్యలు తీసుకోలేదని దీనికి సమాధానం చెప్పాలని అన్నారు. అనేక విషయాలపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య, ఏఈ, డిఈ తదితరులు సమాధానాలు చెప్పారు.

# ఏపీని అప్పుల ఊబిలో ముంచిన జగన్

– పది లక్షల కోట్ల అప్పును జనం నెత్తిన పెట్టిన జగన్ సర్కార్
– అప్పులు, వడ్డీల భారం మోస్తున్న ఎన్డీయే ప్రజా ప్రభుత్వం
– ఈ కష్టాలను అధిగమించి సంక్షేమాన్ని,
అభివృద్ధిని ప్రజలకు అందించేది చంద్రబాబే
– ఎమ్మెల్యే సత్యానందరావు



**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** ఏపీని అప్పుల ఊబిలో ముంచి సర్వ నాశనం చేసింది జగనే అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం ఎమ్మెల్యే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ పది లక్షల కోట్ల అప్పులు చేసి జగన్ సర్కార్ జనం నెత్తిన పిడుగు భారం మోపిందని మండిపడ్డారు. తెలుగుదేశం, జనసేన, భాజపా కూటమి ప్రభుత్వం గడిచిన ఏడు నెలల్లో జగన్ సర్కార్ పెట్టిన 22 వేల కోట్ల రూపాయల బకాయిలను చంద్రబాబు నాయుడు విడుదల చేసినట్లు గుర్తు చేసారు. జగన్ చేసిన అప్పుల భారం వల్ల ఏటా 71వేలకోట్ల అసలు, వడ్డీతో కలిపి లక్షా 40 వేల కోట్లు చెల్లింపుల భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల బకాయిలు 20 వేల కోట్లు, ఇరిగేషన్ కాంట్రాక్టర్ల బకాయిలు 19 వేల కోట్లు, గృహ నిర్మాణం బకాయిలు 78 వందల కోట్లు, ఆరోగ్యశ్రీ బకాయిలు 18 వందల కోట్లు, డిగ్రీ ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు 2832 కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని చెప్పారు. ఇలా మొత్తం 1.40 లక్షలకోట్లు బకాయిలు జగన్ ప్రభుత్వం పెట్టిందని వివరించారు.

**జగన్ జల్సాలు, విలాసాలకు ప్రభుత్వ సొమ్ము దుబారా**

జగన్ తన జల్సాలు, విలాసాలకు ప్రభుత్వ సొమ్మును భారీగా దుర్వినియోగం చేశారని ఆరోపించారు. భారం సుమారు 20 వేల కోట్లని చెప్పుకొచ్చారు. సెంటు పట్టాల పేరుతో 7 వేల కోట్లు, రేషన్ బియ్యంలో 7 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్ సెక్యూరిటీకి, సాక్షి పేపర్ ప్రకటనలకు ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ విలాసాలకు 19,871.35 కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని విలాసాలకు ఖర్చు చేశారని తెలిపారు.

**జగన్ రెడ్డి కుటుంబం 8 లక్షల కోట్ల లూటీ**

అయిదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ రెడ్డి కుటుంబం 8 లక్షల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని లూటీ చేసిందని సత్యానందరావు ఆరోపించారు. భూ కేటాయింపులు, గనుల తవ్వకాలు, సోలార్ అనుమతులు వంటి వాటి ద్వారా తన కుటుంబ సభ్యులకు జగన్ దోచిపెట్టారని చెప్పారు.

లిక్కర్‌లో దోచుకుని దాచుకున్న సొమ్మును జగన్ రెడ్డి తన ఖాతాలో వేసుకున్నారని ఆరోపించారు. అన్ని రకాలుగా 8 లక్షల ప్రజాధనాన్ని జగన్ లూటీ చేశారని విమర్శించారు.ఇన్ని కష్టాలను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందించగల సమర్ధ నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, అందుకే రాష్ట్ర ప్రజలంతా ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని ఎమ్మెల్యే సత్యానందరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తుల రాంబాబు, బండారు సంజీవ్, బూసి భాస్కరరావు, మెర్ల లక్ష్మీపతి, సాధనాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పీఠికాపుర కళావేదికపై "పురూలియా చౌ" నృత్య ప్రదర్శన

– అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న కళాకారులు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** శ్రీ సంగమేశ్వర సంగీత సమాఖ్య ఆద్వర్యంలో... పిఠికాపుర కళావేదిక, బాదం ఉదయ సూర్య ప్రకాశ్ లక్ష్మీ %డ% సన్ ప్రాంగణం, శ్రీ సూర్య రాయ విద్యా నంద గ్రంథాలయం, పిఠాపురంలో మొట్టమొదటి సారిగా 98 దేశాలలో ప్రదర్శనలిచ్చిన కని వినీ ఎరుగని అద్భుతమైన సాంప్రదాయ జానపద నృత్య రూపకం 'పురూలియా చౌ' కార్యక్రమం ప్రేక్షకులను ఆకట్టు కుంది. ఈ కార్యక్రమాన్ని గట్టి శ్రీకృష్ణ దేవరయలు, బాదం ఉదయ సూర్య ప్రకాశ్, వెన్నపు చక్రధరరావు, వసంత ప్రసాద్, రాయవరపు సుబ్బారావు, సీతా లక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పురూలి యా చౌ' అనేది భారత దేశంలో పశ్చిమ బెంగాల్ కు చెందిన సెమి క్లాసికల్ జానపద నృత్యం. ఈ నృత్యంలో అనేక విన్యాసాలు మరియు యుద్ధానికి సంబంధించిన కదలికలతో పురాణాలకు సంబంధించిన కొన్ని కథల ఆధారంగా కళాకారులు అనేక రంగులతో కూడిన దుస్తు లు, మాస్కులు వేషాలకు తగ్గట్టుగా ధరించి, మొహురి, షెహనాయ్ వం టి సంగీత వాయిద్యాలు, రకరకాల తాళ వాయిద్యాలతో డోల్, ధుమ్సా, ఖర్క, మొదలైన తాళ వాయిద్యాలను ఉపయోగించి ప్రదర్శిస్తారు. పురూలియా చౌ' ని 2010లో యునెస్కో వారు వారసత్వ సంపదగా గుర్తించడం జరిగింది. మహిషాసుర మర్ధిని, అభిమన్యు వధ కథలను పీటికాపుర కళావేదికపై ప్రదర్శించారు. కార్యక్రమంలో... మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొండేపూడి శంకర్రావు, అల్లవరపు నగేష్ మరియు ఆగంటి ప్రభాకర్, రామ చంద్రరావు,ప్రసాద్ మరియు కళాకారులు,కళా ప్రియులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిర్మించిన బిల్డింగ్‌ని తక్షణమే

# ఆదివాసి కార్యాలయానికి అప్పగించాలి

**చింతూరు, మేజర్‌న్యూస్ :** ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ స్థాయి సమావేశం స్థానిక చింతూరు డివిజన్ కేంద్రంలో, మండల అధ్యక్షులు, సోడె ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చింతూరు కేంద్రంగా గిరిజ నేత్రులు ఆదివాసి భూములలో బినామీ పేర్లతో అనేక అక్రమ కట్టడాలు నిర్మిస్తున్న, ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకు నీరు ఎత్తినట్టుగా వ్యవహరిస్తూ, చట్ట వ్యతిరేక చర్యలకు సపోర్ట్ చేస్తూ, ఆదివాసి చట్టాలను తూట్లు పొడుస్తున్నారన్నారు.

సంక్షేమ పరిషత్ కార్యాలయ విషయంలో అధికారులు, విఫలమయ్యారని, ఆదివాసి సంక్షేమ పరిషత్‌కి కేటాయించిన స్థలంలో బినామీ పేరుతో ఒక గిరజనేత్రుడు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తా ఉంటే అడ్డుకోబోయిన ఆదివాసి సంక్షేమ పరిషత్ కార్యకర్తలపై గిరిజనేత్రుడు బెదిరింపులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఆదివాసుల పేరున బినామీగా అనేక షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తూ, ఆదివాసి చట్టానికి తూట్లు పొడుస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతున్నాడన్నారు.

ఆక్రమించిన ఆ యొక్క అక్రమ భవనాలు అన్ని తక్షణమే ప్రభుత్వం సీజ్ చేసి స్వాధీనపరుచుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. 1/70, చట్టానికి విరుద్ధంగా ఉన్నటువంటి కట్టడాలను తక్షణమే ప్రభుత్వం సీజ్ చేయాలని అదేవిధంగా, చట్టవ్యతిరేకంగా ఇచ్చిన అధికారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. అదే విధంగా ఆదివాసి సంక్షేమ పరిషత్‌కి కేటాయించిన స్థలంలో నిర్మించిన అక్రమ భవనాన్ని ఆదివాసీ సంక్షేమ పరిషత్‌కి కేటాయించాలని, లేని పక్షాన ఆదివాసి సంక్షేమ పరిషత్ తీసుకునే చర్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు పూనం చిన్న వీరభద్రం, కుంజా శ్రీను, శీలం కృష్ణ డివిజన్, మరియు మండల నాయకులు సోడి రాఘవయ్య, చవలం కోటేశ్వరరావు, పాయం నాగరాజు, దుమ్మిరి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

మొదటిపేజి తరువాయి

మార్పు రావాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. అనంతరం వెంకట్రామ థియేటర్ లోని శివదుర్గ హొటల్, కుమార్ హొటల్, తహశీల్దార్ కార్యాలయం ఎదురు హొటల్స్ లో 100 స్టీల్ గ్లాస్, ప్లేట్స్ అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సెక్రటరి లు ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ

మొదటిపేజి తరువాయి

పట్టభద్రులు ఓటర్లుగా నమోదమయ్యారని, వీరిలో లక్షా 83 వేల 734 మంది పురుషులు, లక్షా 31 వేల 507 మంది మహిళలు, 20 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారన్నారు. నామినేషన్ల తుది తేదీ వరకు ఓటర్లుగా నమోదు అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని, www.nvsp.in వెబ్సైటు ద్వారా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, 1952 ఓటర్ హెల్ప్లైన్ సేవలు వినియోగించుకోవచ్చన్నారు.పట్టభద్రుల ఓటరు జాబితాలో ఎవరైనా అనర్హులు ఉంటె వివరాలను తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, ప్రభృతులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్,ఎమ్మెల్యే

మొదటిపేజి తరువాయి

కె.సుబ్బారావు, జిల్లా అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ముఖ్య మంత్రి సెక్యూరిటీ పర్యవేక్షకులు అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్డిఓలు దాసిరాజు, ఖతీబ్ కౌసర్ భానో, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఇ.వి సుబ్బారావు,డి.ఎస్.పిలు డాక్టర్ శ్రీవేద,ఎంవివి సత్యనారాయణ, ఆర్అండ్‌బి ఈఈ రామరాజు, డిఈఈ జి.వరలక్ష్మి, డిపిఓ అరుణ శ్రీ,జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి నాగేశ్వరరావు, జిల్లా విద్యుత్ అధికారి రఘునాథ్‌బాబు, సర్పంచ్‌నక్క శ్యామల, దేవాలయాల తనిఖీఅధికారులు వి.వెంకటేశ్వరరావు, జి.ప్రసాద్, తహసిల్దార్ అనిత కుమారి, ఎంపీడీవో టి.ఎస్ మూర్తి, శ్రీ వాసవి దామ్ సెక్రటరీ కె.రాజా, పెనుగొండ సిఐ ఆర్.విజయ్ కుమార్,ఎస్.ఐ గంగాధర్,అధికారులు, మార్కెట్ యార్డ్ అధికారులు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

## సమాజ సేవయే పరమావధిగా పనిచేస్తున్న వాసవి క్లబ్

**కొవ్వూరు, మేజర్‌న్యూస్ :** సమాజ సేవయే పరమావధిగా వాసవి క్లబ్ పనిచేస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస్ గుప్తా అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహెూత్సవాన్ని కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణమండపం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు వాసవి క్లబ్ అధ్యక్షునిగా మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్, కోశాధికారిగా సత్యవరపు భరత్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా దేవతు కృష్ణ ప్రసాద్ లచే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చలగంట్ల ఎన్ వి ఎస్ ఎస్ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్తా మాట్లాడుతూ సమాజంలో అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందించడంలో నిరంతరం కృషి చేస్తానని అన్నారు. సేవయే పరమావధిగా పనిచేస్తూ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వలివేటి ఎల్ ఎన్ వి ప్రసాద్, క్యాబినెట్ సెక్రటరీ ఎస్ వి .చలపతిరావు, క్యాబినెట్ ట్రెజరర్ చల్లగంట్ల వెంకటేశ్వరరావు, వయసు గవర్నర్ కేదార శెట్టి రవికుమార్, డిస్టిక్ ఇన్చార్జి గ్రంధి గంగాధర ప్రవీణ్, రీజియన్ చైర్మన్ ఆలపాటి అచ్యుత లక్ష్మి, జోన్ చైర్మన్ కాకి అనిల్ సూర్య, కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మట్టే వీర వెంకట ప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్ కోశాధికారి తుమ్మలపల్లి రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ,కక్కిరాల సోమయ్య, తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉమా ఎడ్యుకేషనల్ సొసైటీ సేవలు వినియోగించుకోవాలి






**- విభిన్న ప్రతిభావంతులకు జిల్లా కలెక్టర్ సూచన**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లా విభిన్న ప్రతిభావంతుల పునరావాస కేంద్రం, ఏలూరు జిల్లా డి.ఎం. టి సమావేశం బుధవారం కలెక్టరేట్ లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా కలక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏలూరు దొండపాడులో నిర్వహించబడుతున్న జిల్లా పునరావాస కేంద్రం ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ద్వారా జిల్లాలోని అవసరత కలిగిన దివ్యాంగుల అందరూ ఉచితంగా ఫిజియోథెరపీ, క్యాలిపర్స్, మున్నగు కృత్రిమ అవయవాల తయారు చేయించుకుని లబ్ది పొందే లాగా జిల్లా అంతట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,దానికి సంబంధించిన సమాచారాన్ని ముందుగానే సంబంధిత అధికారులకు తెలియజేసి , ఎక్కువమంది ప్రజలు హాజరయ్యేలాగా ప్రచార కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వికలాంగుల పునరావస కేంద్రం ప్రగతి పథంలో నడుపుటకు తీసుకోవలసిన చర్యలపై చర్చించడం జరిగింది. అలాగే జూలై 2024 నుండి జనవరి 25 వరకు నిర్వహించిన అవగాహన సదస్సుల నివేదికలను కలెక్టర్ పరిశీలించి తగు సూచనలు చేశారు. ఇంకను ఇతర వివరాలు కొరకు స్వయంగా కానీ ఫోన్ సంఖ్య 08812-249297, ,7386565469 నకు సంప్రదించి సదరు సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ప్రతిభావంతుల,హిజ్రాలు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్, డిపిఒ. కె.అనురాధ ఐసిడిఎస్ పిడి శారద,ఉమా ఎడ్యుకేషనల్ , టెక్నికల్ సొసైటీ ఇన్ ప్లాంటింగ్ ఏజెన్సీ పెద్దిరెడ్డి, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్కతో నిండిన చిట్టవరం

**- గొంది పంట కాలవ**



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని చిట్టవరం, గొంది గ్రామాలకు సాగునీరు, తాగునీరు సరఫరా అయ్యే కాలువ గుర్రపు డెక్కతో నిండిపోయింది. రైతులు దాల్వాసాగు ఏర్పాటుకు ఏర్పాట్లు చేసుకుని, నాట్లు వేస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 4వేల ఎకరాలు ఉన్నాయి. ముంపు ప్రమాదం వల్ల సార్వా సాగు ఎక్కువమంది రైతులు చేపట్టలేదు. దాల్వా సాగుపై గంపెడు ఆశలతో ముందుకు సాగుతున్న రైతుకు సాగునీరు అందే అవకాశం లేకుండా పంట కాలవ నిండా గుర్రపు డెక్క పేరుకు పోయింది. ఈ రెండు గ్రామాల్లో తాగునీటి చెరువులకు కూడా ఈ కాలవ నుండే మీరు సరఫరా అవ్వాలి. నిడదవోలు నరసాపురం ప్రధాన కాలవ నుండి చిట్టవరం,గొంది గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కాలువలో గుర్రపు డెక్కను తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

## 1 నుంచి పశ్చిమ డెల్టా 11 ప్రధాన కాలువలకు వంతులు వారిగా నీరు

**భీమవరం,మేజర్ న్యూస్:** గోదావరి నదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున గోదావరి పశ్చిమ డెల్టా 11 ప్రధాన కాలువలకు వంతులు వారి విధానము (టర్న్ సిస్టం) ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలు చేయబడును. ఈ వంతుల వారి విధానం రెండువంతులుగా ఉండును మొదటి వంతు ఆరు రోజులు, రెండో వంతు ఆరు రోజులుగా అమలు చేయడం జరుగుతుందని నరసాపురం ఇరిగేషన్ సబ్ డివిజన్ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ సిహెచ్ వెంకట నారాయణ తెలిపారు.

## 31న భీమడోలు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో మార్పులు

**భీమడోలు,మేజర్ న్యూస్:** భీమడోలు 220 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కండక్టర్ల మార్పు, ,మరమ్మతుల కోసం ఈనెల 31వ తేదీన త్రీఫేస్ విద్యుత్ సరఫరా లో మార్పులు చేస్తున్నట్లు ఎపి ఇ పి డిసిఎల్ ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంబేద్కర్ తెలిపారు. దీనిలో భాగంగా 31వ తేదీన అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మాత్రమే తాగునీటి ,వ్యవసాయ అవసరాల కోసం త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో భీమడోలు సబ్‌స్టేషన్ పరిధిలోని భీమడోలు ,ద్వారకా తిరుమల ,ఉంగుటూరు, పెదవేగి ,దెందులూరు, పెదపాడు ,ఏలూరు రూరల్ మండలాల పరిధిలోగల త్రీఫేస్ విద్యుత్ వినియోగదారులు, ముఖ్యంగా తాగునీట,వ్యవసాయ అవసరాల త్రీఫేస్ విద్యుత్ వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

# సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

**- పోలీస్ స్టేషన్ రైటర్ల శిక్షణలో నూజివీడు డీఎస్ పి ప్రసాద్**



**పెదవేగి,మేజర్ న్యూస్:** పెరుగుతున్న ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ముందుకెళ్తే పోలీస్ స్టేషన్లో సగం సమస్యల పరిష్కారం తేలికవుతుందని నూజివీడు డీఎస్పీకె.వి.వి.ఎన్ ప్రసాద్ అన్నారు. పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన స్టేషన్ రైటర్ల 3 రోజుల శిక్షణ కార్యక్రమం 2వ రోజుకు బుధవారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్ ప్రసాద్ రైటర్ల విధి,విధానాలు, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. పెరుగుతున్న ఆధునికతను అందిపుచ్చుకుంటే సమస్యల పరిష్కారం మరింత తేలికవుతుందన్నారు. కేసుల విచారణలో సీసీ టీవీల ప్రాధాన్యత,వాటి వినియోగం, ప్రజలు, సిబ్బందితో మెసులుకునే విధానంపైనే రైటర్ల సమర్థత ఆధారపడి ఉందని ఆయన తెలిపారు. డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ.ప్రసాద్ మాట్లాడుతూ స్టేషన్లో రైటర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. వారికి ఆదునిక విదానాలపై శిక్షణ ఇవ్వడంద్వారా మరింత మెరుగైన రీతిలో విధులు నిర్వర్తించే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లాలో మెత్తం 36 మంది రైటర్లకు మూడురోజుల పాటు విధినిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శిక్షణ ఇస్తున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీటీసీ సీఐ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల రక్షణ కోసం పనిచేస్తున్న అభయ మహిళా రక్షణ దళం




**భీమడోలు,మేజర్ న్యూస్:** మహిళల రక్షణ కోసం జిల్లా అభయ మహిళా రక్షణ దళం పనిచేస్తుందని పోలీసు అధికారులు తెలిపారు. మహిళలకు సామాజిక, న్యాయ, భద్రత, హక్కుల కల్పనపై అవగాహన కల్పించేందుకు అభయ వాహనం భీమడోలు మండలంలో బుధవారం పర్యటించింది. ఎస్పీ పర్యవేక్షణలో మహిళ పోలీస్ సిఐ,ఎస్ఐ లు ఎం .సుబ్బారావు, కాంతిప్రియ ఆధ్వర్యంలో అభయ వాహనంతో పోలీసు అధికారులు పర్యటనలో భాగంగా గుండుగొలను, ఆగడాల లంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. అక్కడ అభయ వాహనం ద్వారా హెల్ప్ లైన్ సర్వీసులు, అత్యవసర సహాయ లైన్ల గురించి వివరించారు. వీరికి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు సహకరించారు. మహిళలు బాలికలు వృద్ధుల భద్రత కోసం అభయ మహిళా రక్షణ దళాలు పనిచేస్తున్నాయని వివరించారు.సురక్షిత సమాజ స్థాపన కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పంచాయతీల అభివృద్ధి,సుస్థిర పాలనపై శిక్షణ



**ఇరగవరం,మేజర్ న్యూస్ :** పంచాయతీల అభివృద్ధి, సుస్థిర పాలనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ.శ్రీనివాస్ చెప్పారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల బడ్జెట్ ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షులు కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు మాట్లాడారు. పంచాయతీలు అభివృద్ధిలో ముందంజలో ఉండాలన్నారు. పంచాయతీ అధికారులు ఆదాయ వనరులు అన్వేషించి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో యమ్.పి.టీ. సి.లు, సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు,అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జిఎస్ఎం ఫౌండేషన్ చే వీధిలైట్లు ఏర్పాటు

**- జనసేన నేత రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు**



**జీలుగుమిల్లి, మేజర్ న్యూస్ :** ఏళ్ల తరబడిగా ఉన్న వీధిలైట్ల సమస్యను జనసేన పార్టీ అధికార ప్రతినిధి గడ్డమణుగు రవికుమార్ తీర్చడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి నుంచి తాటాకులగూడెం వెళ్లే రహదారిలో చీకటమయంగా ఉండడంతో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రవికుమార్ సమస్యపై యుద్ధ ప్రాతిపదికన సుమారుగా 1 కిలోమీటర్ నూతన విద్యుత్ లైన్ వైర్లు ఏర్పాటు చేశారు. వీధిలైట్లను జిఎస్ఎం ఫౌండేషన్ ద్వారా అందిస్తున్నట్లు గడ్డమణుగు రవికుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఆధ్వర్యంలో గ్రామాల రూపురేఖలు మారబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి తమ కర్తవ్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు చిర్రి శ్రీనివాస్, ఉలవల ముత్యం, విద్యుత్ లైన్మెన్ వార జగన్, కాంట్రాక్టర్ కుటుంబరావు, గ్రామపంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎం దృష్టికి కొల్లేరు ప్రజల సమస్యలు

## – ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ



**ఏలూరు,మేజర్ న్యూస్:** కొల్లేరు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా జీవనం సాగిస్తున్న ప్రజల సమస్యలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడి గారి దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేసేందుకు తను వంతు కృషి చేస్తానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయం ప్రతినిధులను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు యేసు రాజు, సత్యనారాయణ, బీకేఎం నాని, కొల్లి బాబి,తదితరులు కలిసి కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యలతో కూడిన సమగ్ర నివేదికను బుధవారం అందజేశారు.

అనంతరం అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల నేపథ్యంలో కొల్లేరు ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులను ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ మహేష్ కుమార్‌కు ఫోన్‌లో వివరించారు. గతంలో చంద్రబాబు నాయుడు కొల్లేరు ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి చొరవ చూపారని, గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పట్టనట్లు వ్యవహరించడం వల్ల కొల్లేరు సమస్య మొదటి కొచ్చిందని పరిరక్షణ సమితి నాయకులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కైకలూరులో జరిగిన సమావేశంలో తీర్మానించిన వివరాలు, కొల్లేరు ప్రాంత ప్రజల అభిప్రాయాలను త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడుని కలిసి వివరిస్తానని ఎంపీ మహేష్ కుమార్ కొల్లేరు పరిరక్షణ సమితి నాయకులకు భరోసా ఇచ్చారు.

# నిరుపయోగంగా మారిన ఆర్‌అండ్‌బి అతిథి గృహం



## – నిధులు ఎప్పుడొస్తాయో?

## – నిర్మాణాలు ఎప్పుడు జరుగుతాయో?

**భీమడోలు,మేజర్‌న్యూస్:** భీమడోలు రోడ్లు భవనాలు శాఖ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. దీనికోసం ఖర్చు చేసిన సుమారు కోటి రూపాయలు వృధా అయ్యాయి. కొద్దిపాటి మరమ్మతులతో అతిథి గృహాన్ని తిరిగి వినియోగంలోనికి తెచ్చే అవకాశం ఉన్నప్పటికీ రోడ్డు భవనాల శాఖ పట్టించుకోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం అసాంఘిక కార్యక్రమాలకు నెలవుగా మారింది. దీనికి చెందిన విలువైన సామాగ్రి, మోటారు బోరు దొంగల పాలైన రోడ్లు భవనాలు శాఖ నిర్లిప్తంగా. ఉండటం పలు సందేహాలకు అవకాశం ఇస్తుంది. విశాలమైన ఆవరణగల అతిథి గృహాన్ని అప్పటి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రి, స్థానిక శాసనసభ్యులు వట్టి వసంత కుమార్ చొరవతో నిర్మించారు. దీనిలో ఒకటి ఎసి, మరొకటి ఎసి రహిత అధునాతన నూతన సౌకర్యాలతో కూడిన సూట్లను ఏర్పాటు చేశారు . దీనికి అదనంగా ప్రముఖులు వివిధ కాన్ఫరెన్స్ లను నిర్వహించుకునేందుకు ఫర్నిచర్ తో కూడిన సమావేశ మందిరాన్ని నిర్మించారు. నిరంతరం నీటి సరఫరా కోసం బోరు.తో పాటు అంతరాయం లేని విద్యుత్ సరఫరా కోసం ప్రత్యేక ఏర్పాటులను చేశారు. వీటన్నింటికీ తోడు అతిథి గృహంలో బస చేసేవారు, వారి కోసం వచ్చే అతిథులు సహాయకుల కోసం అన్ని సౌకర్యాలను కల్పించారు.

ఒక విధంగా ఇది ఒక రాష్ట్ర మంత్రి , లేదా ఉన్నత స్థాయి ప్రముఖులు తన పర్యటనలో భాగంగా బస చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన అతిథి గృహంగా పేర్కొనవచ్చు. గతంలో బ్రిటిష్ పాలన సమయంలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ద్వారకాతిరుమలతో పాటు రాజమండ్రి ,ఏలూరు, భద్రాచలం ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రముఖులు, అధికారులు బస చేసేందుకు భీమడోలు తో పాటు నల్లజర్ల లో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో అతిథి గృహాలను నిర్మించారు. వీటికి అదనంగా సరైన రహదారి సౌకర్యం లేక ద్వారకా తిరుమల కు వెళ్లే సాధారణ యాత్రికుల సౌకర్యం కోసం భీమడోలు కేంద్రంగా మూడు సత్రాలను అప్పట్లోనే నిర్మించారు. కాలక్రమేణా రహదారి సౌకర్యాలు మెరుగుపడటంతో ఆ సత్రాలు మూతపడ్డాయి. ఆ ప్రాంతాలలో ఇతర నిర్మాణాలు జరిగాయి. ఇక రోడ్లు భవనాల శాఖకు చెందిన భీమడోలు అతిథిగృహంలో కాలం చెల్లిన కనీస సౌకర్యాలు మెరుగుపడకపోవడంతో బస చేసే అధికారులు సంఖ్య క్రమేపి తగ్గుతూ వచ్చింది. ఆ తర్వాత కాలంలో దీనిని భీమడోలు టివి రిలే స్టేషన్‌గా మార్చారు. కొంతకాలం పాటు సేవలు అందుబాటులోనికి వచ్చాయి. ఆ తర్వాత అతిథి గృహం మరింత శిథిలం కావడంతో. టివి. రిలే స్టేషన్ ను. స్థానికంగా గల అద్దె భవనం లోనికి మార్చారు. టివి. రంగంలోనికి ఇతర టివి సేవలు అందుబాటు లోనికి రావడంతో టివి రిలే స్టేషన్ మూతపడింది. ఆ తర్వాత క్రమంలో దీనిపై దృష్టి సారించిన అప్పటి మంత్రి వసంత కుమార్ అతిథి గృహం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేందుకు సహకరించారు. ఆయన నియోజకవర్గంలో పర్యటించే సమయంలో అతిథి గృహం ఆయన కార్యాలయంగా పనిచేసేది. ఇదే సమయంలో అతిథి గృహంలో పని చేసే సిబ్బంది కోసం ప్రత్యేక నిర్మాణాన్ని అతిథి గృహానికి అనుబంధంగా నిర్మించారు. ఒకప్పుడు జిల్లా పర్యటనకు వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి భీమడోలు లో బస వేసేందుకు ఏర్పాటులను చేశారు.

కానీ అప్పట్లో అతిథి గృహం చుట్టూ ప్రహరీ గోడ లేనందున ఆయన బస చేయటం సాధ్యం కాలేదు. దీనిని గమనించిన వసంత కుమార్ ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రభుత్వం మారడంతో ఆ ప్రయత్నాలు నిలిచిపోయాయి. ఆ తర్వాత వచ్చిన శాసనసభ్యులు దీనిని తమ క్యాంపు కార్యాలయంగా వాడుకోవడం, సభలు సమావేశాలు నిర్వహించేందుకు ఉపయోగించుకునేవారు. ఇదే నేపథ్యంలో అప్పటి ఇప్పటి రోడ్లు భవనాల శాఖ అధికారులు అతిథి గృహం ఆవరణలోనే రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, వెల్నెస్ సెంటర్,రక్షిత నీటి పథకము ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మాణం చేపట్టేందుకు అనుమతించడంతో విశాలమైన అతిథి గృహ ఆవరణంలోని కొంత భాగం వారి పరిధి నుంచి తప్పుకుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న ప్రజాప్రతినిధులు అతిథి గృహం ప్రాముఖ్యతను గుర్తించారు. తిరిగి దానిని పునర్నియోగం తెచ్చేందుకు చర్యలు చేపట్టారు. కానీ ఇంతవరకు ఫలప్రదం కాలేదు. ఈ విషయాలపై రోడ్లు భవనాలు శాఖ భీమడోలు సహాయ ఇంజనీర్‌తో పాటు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ను వివరణ కోరగా,అతిథి గృహం శిథిలా వ్యవస్థకు చేరిన మాట నిజమైన న్నారు. దీని మరమ్మతుల కోసం రూ. 40లక్షల అంచనాతో ప్రతిపాదనలను సమర్పించామన్నారు. నిధులు మంజూరు కావలసి ఉందన్నారు. ఇదే సమయంలో అతిథి గృహము రక్షణకు వాచ్ మెన్ నియామకం జరగవలసిన ఉందన్నారు. వీటితో పాటు ప్రహరీ గోడ నిర్మాణానికి అనుమతులతో పాటు నిధులు మంజూరు కావలసి ఉందన్నారు. సామాగ్రి కొంత గవ్వంతయ్యిందన్నారు. ఇవన్నీ పూర్తయితే అతిథి గృహాన్ని ప్రజా ప్రతినిధులు అధికారులతో పాటు అవసరం మేరకు నామమాత్రపు. సామాన్యుల సైతం బస చేసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## బిసి యక్షన్ ప్లాన్ లక్ష్యాలు పూర్తి చేయాలి

### – అధికారులకు జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశం



**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిసి యాక్షన్ ప్లాన్ ను నిర్దేశించిన లక్ష్యాలను సమయంలోగా పూర్తి చేయాలనీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ చైర్ పర్సన్ క్యాంపు కార్యాలయంలో బిసి యాక్షన్ ప్లాన్ అమలుపై అధికారులతో జెడ్పి చైర్ పర్సన్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బిసిల సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నదని, ప్రజల ఆశయాల మేర పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వెనుకబడిన తరగతులు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను అర్హులైన వారికి మార్చి నెలాఖరు లోగా అందించాలన్నారు. స్వయం ఉపాధి కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి, ఆర్థిక మంజూరు కోసం సంబంధిత బ్యాంకులకు పంపి, బ్యాంకర్లు లోన్లు మంజూరుచేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. యూనిట్ల స్థాపనలో అభ్యర్థులు ఏదైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో బిసి యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు,లక్ష్యసాధన వివరాలను జెడ్పి చైర్ పర్సన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కెఎస్ఎస్ సుబ్బారావు బీసీ కార్పొరేషన్ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎన్.పుష్పలత, ప్రభృతులు పాల్గొన్నారు.

## ఎరువులు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

### – వ్యవసాయ శాఖ ఏడి అనిల్ కుమారి



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్:** మండలంలోని సీతారాంపురం నార్త్, పసలదీవి, చామకూరిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డివిజనల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈదా అనిల్ కుమారి, మండల వ్యవసాయ అధికారి శామ్యూల్ జాన్సన్,ఏఈఓ లక్ష్మి నారాయణ పాల్గొని పలు సొసైటీలలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా ఏడి మాట్లాడుతూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఎరువుల యాజమాన్యం పై సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది. చాలామంది రైతులు కాంప్లెక్స్ ఎరువులు రెండు మూడు కోటాలలో వేస్తున్నారు అలా వేయకూడదని మొదటి కోటాలోనే కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని అన్నారు. చిన్నమిల్లి కృష్ణమూర్తి పొలాన్ని మినీ కిట్టుగా వేసిన బీపిటి 3082 రకాన్ని పరిశీలించడం జరిగినది. ఈ రకంలో ఆకు ముడత,కాండం తొలిచూపురుగులు ఆశించడం గమనించారు. డివిజన్ పరిధిలో గల నరసాపురం మండలంలో 241 టన్నుల యూరియా, ఎలమంచిలి మండలంలో 130 టన్నుల యూరియా, మొగల్తూరు మండలంలో 32 టన్నుల యూరియ అందుబాటులో ఉన్నదని రైతులు ఎవ్వరూ యూరియ ఎక్కువగా కొనుగోలు చేసి వారి వారి ఇళ్లల్లో నిల్వ ఉంచవద్దు అన్నారు. ప్రస్తుత కోటాకు అవసరమైన ఎరువులు మాత్రమే కొనుగోలు చేయవలెనని,ప్రైవేటు డీలర్లు కూడా యూరియాను 266 రూపాయలకే అమ్మవలెనని అధిక ధరలకు అమ్మినచో తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

# 5న కేంద్ర కార్మిక సంఘాల నిరసనలో ఏఐటియుసి పాల్గొనాలి

**ఏలూరు,మేజర్ న్యూస్:** కేంద్ర ప్రభుత్వం 2025 26 వార్షిక బడ్జెట్లో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు నిధులు ఎక్కువగా కేటాయించాలని విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసే ప్రతిపాదనలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 5వ తేదీన కేంద్ర కార్మిక సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఏఐటియుసి రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్ఫూర్తి భవనంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వర్గ సమస్య పరిష్కరించడంలో వైఫల్యం చెందాయని ఆయన పేర్కొన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో ఏఐటియుసి నిర్వహించనున్న ఉద్యమాలు పోరాటాల గురించి వెంకటసుబ్బయ్య వివరించారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయుటకు చర్యలు ముమ్మరం చేసిందని తెలిపారు. అందులో భాగంగానే కార్మిక వర్గాన్ని రాష్ట్ర ప్రజానీకాన్ని పక్కదారి పట్టించుటకు 11000 కోట్ల రూపాయలు విశాఖ ఉక్కుకు ప్యాకేజీ




ప్రకటించిందని అన్నారు. జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ జిల్లాలో ఏఐటియుసి నిర్మాణానికి అభివృద్ధికి పార్టీ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు,జిల్లా నాయకులు కే.కృష్ణమాచార్యులు బండి వెంకటేశ్వరరావు,పుప్పాల కన్నబాబు ,భజంత్రీ శ్రీనివాసరావు,గంధం అంజమ్మ ,కారం సారయ్య ,కుంచే వసంతరావు ,బల్ల కనకదుర్గారావు ,తదితరులు మాట్లాడారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేసిన న్యాయమూర్తి



**నర్సాపురం, మేజర్ న్యూస్ :** ఆంధ్రరాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు గత డిసెంబర్ మాసంలో శ్రీ వై.ఎన్. బి. ఈడి, కళాశాలలో మానవ అక్రమ రవాణా, బాల్య వివాహం, అనే సబ్జెక్ట్ లపై మండల న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన వ్యాసరచన, రీల్స్ పోటీ పరీక్షలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందజేశారు. 10వ అధనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ స్థానిక కోర్ట్ ప్రాగణంలో విద్యార్థులకు బహు మతులను సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు చట్టపరమైన అంశాలపై కూడా దృష్టి సారించాలని, అందుకే ఉన్నత న్యాయ స్థానాలు ఇలాంటి చట్టాలపై అవగాహన పొందేందుకు, వ్యాసరచన, డిబేట్, షార్ట్ ఫిల్మ్స్, రీల్స్ మొదలగు పోటీలను నిర్వహిస్తున్నారన్నారు.సోషల్ మీడియా ద్వారా కూడా ప్రజలలో అవగాహన కల్పించడానికి ఇదొకమార్గం అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ, కార్యదర్శి ఆర్. పుల్లాజీ ,శ్రీ వై.ఎన్ బి. ఇడి కళాశాల ప్రిన్సిపాల్ డా.పి.శాంతి , కళాశాల సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

# హెడ్మాష్టర్ సూర్య కుమార్‌కు మహాత్మా గాంధీ స్మారక పురస్కారం



పోడూరు,మేజర్ న్యూస్: భీమవరం పెద అమిరం లోని మహాత్మా గాంధీ మెమోరియల్ మెడికల్ ట్రస్ట్ ప్రాంగణంలో జిల్లా సర్వోదయ మండలి, ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి, మానవత సంస్థల ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ 77వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. 'గాంధేయం – మార్గదర్శకం' కవిత పోటీలో విజేతలైన కవులచే కవితా గోష్టిని నిర్వహించారు.

విజేతలలో ఒకరైన పోడూరు మండలం,చింతలగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్ ఈ సందర్భముగా 'హృదయ విజేత' అనే కవితను ఆలపించి, తోటి కవుల ప్రశంసలను పొందారు. సభకి విశిష్ట అతిథిగా విచ్చేసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డా.ఎం.ఆర్.రాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద రాజు,మానవత సభ్యులు సమిష్టిగా సూర్య కుమార్‌ని ఘనంగా సత్కరించి, అభినందించారు.

# నిర్వాసితులకు న్యాయం చేయాలి : కాంగ్రెస్ పార్టీ ధర్నా



కుక్కునూర్,మేజర్ న్యూస్ : మండల పరిధిలోని పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాల ప్రజలకు పూర్తి న్యాయం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు,పోలవరం నియోజకవర్గ కన్వీనర్ బండి విజయభాస్కర్ మాట్లాడుతూ కుక్కునూరు మండలాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతి ఒక్క నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ ఇవ్వాలని గత 7 సంవత్సరాల క్రితం సర్వే చేసి ఆ రోజున ఉన్న రేట్లు ప్రకారం ఈరోజు అదే ప్యాకేజీ ఇవ్వటం అన్యాయమని ఇప్పుడు ఉన్న మార్కెట్ రేట్లు ప్రకారం నాలుగు రెట్లు ప్యాకేజీని పెంచి ఇవ్వాలని 18 సంవత్సరాల నుండిన ప్రతి ఒక్కరికి ప్యాకేజీ ఇవ్వాలని నిత్యవసర వస్తువుల ధరలు నిత్యం పెరుగుతూనే ఉన్న ఉద్యోగస్తుల జీతాలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉన్న నిర్వాసితుల ప్యాకేజీలు మాత్రం పెంచలేదని ఆ విధంగా నిర్వాసితులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని వారి సమస్యలు తీరే వరకు ఈ పోరాటం చేస్తామనీ ఈ పోరాటం గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు తీసుకువెళ్తామని వారన్నారు

అనంతరం తాసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ రాజారత్నం కుక్కునూరు పార్టీ మండల అధ్యక్షులు గజరాజులు ఉపాధ్యక్షులు వడ్డే రఘు బాబు ఎస్టి సెల్ అధ్యక్షులు మడకం వీరయ్య సెక్రెటరీ వీరాచారి వర్షా నాగేశ్వరరావు సీనియర్ నాయకుడు ఎస్.కె షఫీ బీసీ సెల్ అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ గాడిద మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌సిఎమ్ చర్చికి రూ.40 వేల ఖరీదైన ఇటుకలు అందజేసిన మంత్రి

– మానవత్మమే నా మతం సమాజ సేవ నా కర్తవ్యం : పార్థసారథి



**నూజివీడు,మేజర్ న్యూస్:** రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి గత నెల రోజుల క్రితం నూజివీడు మండలం అన్నవరం గ్రామంలో పర్యటించగా స్థానిక ఆర్ సి యం ప్రార్థనా మందిరం ఫాదర్స్,సంఘ పెద్దలు ప్రార్థనా మందిరం అభివృద్ధి పనుల నిమిత్తం మంత్రి ని అభ్యర్థించగా మాట ఇచ్చిన కొద్ది రోజుల వ్యవధిలో సుమారు రూ.40 వేల ఖరీదైన ఇటుకలను ఆయన వ్యక్తిగత సిబ్బందితో చర్చ్ ఫాదర్ జి.జోషప్,సంఘ సభ్యులకు బుధవారం అన్నవరం ప్రార్థనా మందిరంలో అందజేశారు.గత రెండురోజుల క్రితం తమ వ్యక్తి గత సిబ్బందితో అన్నవరం ఆర్ సి ఎమ్, ప్రార్థనా మందిరానికి వెంటనే ఇటుకలు అందజేయవలసినదిగా మంత్రి ఆదేశించారు. మాట ఇచ్చిన కొద్ది కాలం వ్యవధిలోనే మంత్రి తన సొంత డబ్బుతో రూ,40 వేల ఖరీదు చేసే ఇటుకలను అడిగిన వెంటనే అందజేసిన మంత్రి పార్థసారథికి అన్నవరం ఆర్ సి,ఎమ్ ప్రార్థనా మందిరం ఫాదర్, సంఘ పెద్దలు భక్తులు తమ హర్షాన్ని కృతజ్ఞతలు తెలియజేసారు.

# ఈవిఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



ఏలూరు,మేజర్ న్యూస్: ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా బుధవారం కలెక్టర్ వెట్రిసెల్వి ఈవిఎం గోదామును సందర్శించి షర్టర్లకు ఉన్న సీళ్లను, ఫైర్‌ఎక్స్ టింగ్విషర్ లను, సిసి కెమేరాల పనితీరును పరిశీలించారు. అదే విధంగా ఈవిఎంల రక్షణ భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడ భద్రతా విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టం సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రెవిన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

# మధ్యాహ్న భోజనం పథకంపై ఆకస్మిక తనిఖీ



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** వీవర్స్ కాలనీ నందు గల జివి ఎస్ వి ఆర్ యం మున్సిపల్ ప్రాథమిక పాఠశాల లో మధ్యాహ్న భోజన పథక జిల్లా కోఆర్డినేటర్ గుంటపల్లి చిన్నయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా ఎండి ఎం రిజిస్టర్లు. విద్యార్థుల హాజరు. మధ్యాహ్నం భోజన పథకం స్వీకరించే హాజరు పరిశీలించారు. అనంతరం విద్యార్థిలతో కలిసి భోజనం చేశారు. గుడ్ల పరిమాణం పరిశీలించారు. టాయిలెట్లు. బాత్రూములు. స్కూల్ కిచెన్ గార్డెన్. పాఠశాల పరిసరాలు పరిశుభ్రతను చూసి సంతృప్తి చెందారు.

దాతలు ద్వారా పాఠశాల అభివృద్ధిని చేస్తున్న హెచ్‌ఎం భవానీ ప్రసాద్ రాయపూడి ఉపాధ్యాయులకి ఆదర్శమన్నారు. ఈ పాఠశాల అభ్యుదయ పాఠశాలకు కావలసిన వనరులు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ లింగేశ్వర్. రామకృష్ణ .పేరెంట్స్. తదితరులు పాల్గొన్నారు,

# పకడ్బందీగా ఇంటర్ పరీక్షలు నిర్వహించాలి





**- జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** జిల్లాలో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్మీడియేట్ థియరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో బుధవారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధ్యక్షతన జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 55 పరీక్షా కేంద్రాల్లో మార్చి 1వ తేదీ నుంచి మార్చి 20వ తేదీ వరకు ఉదయం 9 గం. నుంచి మధ్యాహ్నం 12 గం. వరకు పరీక్షలు నిర్వహిస్తున్నామని, పరీక్షలకు 33,511 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. కొన్ని అధనపు బస్సులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్స్ నిర్వహించే అన్ని సెంటర్లలో సిసి కెమేరాల నిఘా ఉంచాలన్నారు. పరీక్షా కేంద్రాలను నో సెల్ ఫోన్ జోన్ గా నిర్ధేశించడం జరిగిందని పరీక్షా కేంద్రంలోకి సెల్ ఫోన్లు అనుమతించబడవన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ 08812-230197 ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేశారని,దీంతో పాటు కలెక్టరేట్, పోలీస్ కార్యాలయంలో కూడా కంట్రోల్ రూమ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖ అధికారి (ఆర్ఐఓ) కె.చంద్రశేఖర్ బాబు మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 29 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్(ఒకేషనల్), ఫిబ్రవరి 10 నుంచి నుంచి 20వ తేదీ వరకు 69 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్(జనరల్) పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అధనపు అడిషనల్ ఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, డిఆర్ఓ వి. విశ్వేశ్వరరావు, ఆర్ఐఓ కె. చంద్రశేఖర్ బాబు,డివిఇవో బి.ప్రభాకరరావు, డిఇసి కమిటీ సభ్యులు కె. యోహాన్, ఎల్. శ్యామ్ కుమార్, బి.వి. శ్రీనివాస్, పి. జ్యోతి, డిఇఓ వెంకటలక్ష్మమ్మ, డిపివో కె. అనురాధ లతో పాటు పోస్టల్, వైద్య ఆరోగ్యశాఖ, ట్రాన్స్ కో ,తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించిన జనసేన నేత రవికుమార్



**జీలుగుమిల్లి,మేజర్న్యూస్:** మాజీ శాసన సభ్యులు తెల్లం బాలరాజు మాతృ మూర్తి తెల్లం మల్లమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో జనసేన పోలవరం నియోజకవర్గ అధికార ప్రతినిధి గడ్డమ ణుగు రవికుమార్ బాలరాజును పరామర్శించారు. బుధవారం సాయంత్రం బాలరాజు స్వగ్రామం దుద్దుకూరులోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి తెల్లం మల్లమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెల్లం బాలరాజుతో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకుని ఆయనకు ధైర్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా రవికుమార్ పనిచేసే కాలంలో తెల్లం బాలరాజును మొదటిసారి శాసనసభ్యులుగా గెలిపించేందుకు అహర్నిశలు కృషి చేశారు. తెల్లం బాలరాజుకు గడ్డమణుగు రవికుమార్కు 20 ఏళ్లుగా రాజకీయ అనుబంధం ఉంది. బాలరాజు మొదటిసారి శాసనసభ్యులుగా గెలుపొందినప్పుడు రవికుమార్ జీలుగుమిల్లి మండల జడ్పిటిసిగా పనిచేశారు. వీరిద్దరూ మండల అభివృద్ధికి కలిసి కృషి చేశారు. నేడు ఇరువురు పార్టీలు వేరైనప్పటికీ మాజీ శాసనసభ్యులు బాలరాజును కలిసి ధైర్యం చెప్పారు. వీరితోపాటు జనసేన నాయకులు చిర్రి శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 31న వేగివాడ సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ నిలివివేత

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈ నెల 31వ తేదీ శుక్రవారం పెదవేగి సెక్షన్ పరిధిలోని 33 కేవీ వేగివాడ సబ్-స్టేషన్ పరిధిలోని మరమత్తులు చేయుటవలన 11కేవీ ఫీడర్లుకు అంతరాయము కలుగుతుంది.

కనుక ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంటల వరకు సరఫరా నిలిపి వేయబడును. కనుక పెదవేగి మండలం పరిధిలో ఉన్న వేగివాడ,చక్రాయగూడెం, కేన్నాపురం, చల్ల చింతలపూడి గ్రామాలకు సరఫరా అంతరాయం కలుగును.కనుక వినియోగదారులు సహకరించాలి విద్యుత్ అధికారులు కోరారు.

# గిరిజనులకు మౌలిక వసతులు కల్పించాలి



**బుట్టాయిగూడెం,మేజర్ న్యూస్:** రామన్నగూడెం గిరిజనులకు న్యాయం చేసి మౌలిక వసతులు కల్పించాలని సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చోడెం దుర్గ కోరారు. మండలంలోని కోట రామ చంద్రపురం ఐటీడీఏ వద్ద బుధవారం గిరిజన దర్బార్ నిర్వహించి గిరిజనుల నుండి ఐటీడీఏ పి ఓ శ్రీరాములు నాయక్ వినతులు స్వీకరించారు. బుట్టాయిగూడెం మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చోడెం దుర్గ ఆధ్వర్యంలో పివోను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం చోడం దుర్గ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రామన్నగూడెం గ్రామంలో 180 గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నారని వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని పి ఓ ని కోరినట్లు తెలియజేశారు. రామన్నగూడెం రెవెన్యూ పరిధిలో 4-1 సర్వే నెంబర్ లో రామన్నగూడెంకు చెందిన 180 గిరిజన కుటుంబాలు గృహాలను నిర్మించుకొని జీవిస్తున్నారని, ఆ భూమిని ఆ గ్రామానికి చెందిన కొంతమంది స్వార్థపరులు సీతారామ దేవస్థాన భూమిగా నమోదు చేయించారని ఆమె ఆరోపించారు. దేవస్థానం భూమిగా నమోదు చేయించడంతో అక్కడ నివాసం ఉంటున్న గిరిజనులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. ఆ భూమిలో వాటర్ టాంక్, అంగన్వాడీ, హాస్పిటల్ మొదలగు ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయన్నారు. దేవస్థానం భూమిగా నమోదు కావడం వల్ల అక్కడ ఎటువంటి ప్రభుత్వ సౌకర్యాలు అందటం లేదని ఆమె పేర్కొన్నారు.

తారుమారు అయిన రికార్డులను పరిశీలించి దేవస్థానం పేరును తొలగించి రామన్నగూడెం గిరిజనులకు న్యాయం చేయాలని ఆమె పిఓ శ్రీరాములు నాయక్ని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ కార్యకర్తలు, రామన్నగూడెం గిరిజనులు, తదితరులు ఉన్నారు.

## పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



**పెనుగొండ,మేజర్న్యూస్:** గ్రామపంచాయతీలో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిడిఓ టి.సూర్య నారాయణ మూర్తి పేర్కొన్నారు. పెనుగొండ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళికకు సంబంధించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.జిపిడిపి (గ్రామ పంచాయతీ డెవలప్ మెంట్ ప్లాన్) ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు , వైస్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం, ఎంపిటిసి సభ్యులు ,అన్ని గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు,మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది,సచివాలయ సిబ్బంది,వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాలకు షాపుల కేటాయింపు

**పాలకొల్లు ,మేజర్ న్యూస్:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఆచంట మండలం, పోడూరు మండలాలకు సంబంధించి రెండు కల్లు గీత కులాల మద్యం షాపులు ప్రభుత్వం కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ తెలియజేశారు. ఆచంట మండల పరిధిలో 1 షాపు,పోడూరు మండలం పరిధిలో 1 షాపు ఏర్పాటు చేసుకోవడానికి శెట్టి బలిజ సామాజికవర్గానికి చెందినవారికి రిజర్వేషన్ గా ప్రభుత్వ జీవోలో పేర్కొన్నారని ఆయన తెలిపారు. దరఖాస్తులు ఆన్లైన్, ఆఫ్లైన్ ప్రక్రియలో సమర్పించవచ్చని,వచ్చే నెల అనగా ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు సమర్పణ ప్రక్రియకు గడువు ఉందన్నారు. 6వ తేదీ వచ్చిన దరఖాస్తుల పరిశీలన చేసి, 7వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గౌరవ కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహిస్తారని తెలిపారు. ఇందుకోసం బిసీ శెట్టిబలిజ కుల ధ్రువీకరణ పత్రము, పశ్చిమ గోదావరి జిల్లా స్థానికత ధ్రువీకరణ పత్రముతో ఆశావహులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

## ఈ బాలుడి ఆచూకి తెలపండి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఈ ఫొటోలో కనిపిస్తున్న బాలుడికి సుమారు 14సం ఉంటాయి, ఏమి అడిగిన మాట్లాడడం లేదు. ఈ బాలుడు ఏలూరు పాత బస్టాండ్ ఏరియా నందు తిరుగుచుండగా, ఆటో వారు గుర్తించి చైల్డ్ హెల్ప్ లైన్ వారికి సమాచారం అందించడం జరిగింది. ఈ బాలుడు గురించి తెలిసిన వారు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ వారిని సంప్రదించండి. చైల్డ్ హెల్ప్ లైన్ ఏలూరు 7702748404 అలాగే 2వ పట్టణ పోలీసులు 9440796606 వారికి తెలపగలరు.

## విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి

మేజర్ న్యూస్: ఈ నెల 31వ తేదీన శుక్రవారం పెదవేగి సెక్షన్ పరిధిలోని 132/33 కేవీ పెదవేగి సబ్-స్టేషన్ పరిధిలోని సబ్ స్టేషన్లో మరమత్తులు చేయుటవలన ఈ క్రింది పరిధిలోని ఉన్న 33కేవీ సబ్ స్టేషన్స్లో ఉన్న అన్ని 33 కేవీ ఫీడర్లు ,వేహాన్ కాఫీ ఫీడర్ ,పెదవేగి 132 కేవీ పరిధిలో గల 11కేవీ ఫీడర్లుకు అంతరాయము కలుగును. కనుక మద్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపి వేయబడును. ఈ కారణంగా పెదవేగి మండలం పరిధిలో ఉన్న కవ్వగుంట,పెదవేగి, సూర్యారావుపేట ,లక్ష్మీపురం, వైఎస్ఆర్ కాలనీ , గార్లమడుగు, వెంకట కృష్ణాపురం ,జగన్నాధపురం ,వంగురు లక్ష్మీపురం,కూచిపూడి, న్యాయంపల్లి, రామసింగవరం,గ్రామములకు సరఫరా అంతరాయం కలుగుతుందని తెలిపారు.

# కలెక్టరేట్ తరలింపు ప్రచారంపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పష్టత ఇవ్వాలి

**- గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం మార్కెట్ యార్డులోనే ఉంచాలి**

**- మారుమూలకి తరలిస్తే సహించం**

**- ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఉద్యమిస్తాం : సిపిఎం**




**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టరేట్ తరలింపు పై వస్తున్న ప్రచారంపై జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తక్షణం స్పష్టతను ఇవ్వాలని, అదేగనుక నిజమైతే ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ హెచ్చరించారు. బుధవారం సిపిఎం జిల్లా కార్యాలయం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు బి.బలరాం, బి.వాసుదేవరావు లతో కలిసి జిల్లా కార్యదర్శి జే.ఎన్.వి.గోపాలన్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం భీమవరం పట్టణంలో ఉన్న మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టరేట్ కి కేటాయిస్తూ జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. జిల్లా నలుమూలల నుంచి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డ్ ని కేటాయించారన్నారు. ప్రస్తుతం కలెక్టరేట్ ని తరలిస్తున్నట్లు జిల్లాలో ప్రచారం జరుగుతోందని,దీనివల్ల ప్రజలకు గందరగోవల పడుతున్నారన్నారు. దీనిపై తక్షణం స్పష్టతనివ్వాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు పట్టణంలోనే ఉన్న ప్రకృతి ఆశ్రమంలో ఉన్న భవనంలో కలెక్టరేట్ ని నిర్వహిస్తున్నారన్నారు. అది కూడా ప్రజలకు కొంత దూరం అవ్వడంతో ప్రజల అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇది తాత్కాలికంగానే ఉంటుందని కలెక్టరేట్కు సొంతభవనాలు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం తెలిపిందన్నారు. ఆ మేరకు బైపాస్ రోడ్డులో ఉన్న మార్కెట్ యార్డులో 20 ఎకరాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం జీవో కూడా ఇచ్చిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో ఆ జీఓను రద్దుచేసి కలెక్టరేట్ని వేరే మారుమూల ప్రాంతానికి తరలిస్తున్నట్లు ప్రచారం సాగుతూ ఉందని తెలిపారు. ఈ ప్రచారం ప్రజలను గందరగోళం పరుస్తోందని అవేదన వ్యక్తం చేసారు. ప్రస్తుతం కలెక్టరేట్ ఉన్న ప్రకృతి ఆశ్రమం ఏరియా కంటే బైపాస్ రోడ్‌లో ఉన్న మార్కెట్ యార్డు స్థలమే జిల్లాలో అన్ని ప్రాంతాల ప్రజలకు వీలుగా ఉంటుందన్నారు. కాబట్టి యధావిధిగానే గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ఆధారంగా కలెక్టరేట్ ను కొనసాగించాలని గోపాలన్ సూచించారు. మారుమూల ప్రాంతానికి ఉద్దేశపూర్వకంగా తరలించాలని చూస్తే సహించబోమని,జిల్లావ్యాప్తంగా ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

# సమాజ సేవయే పరమావధిగా పనిచేస్తున్న వాసవి క్లబ్

**కొవ్వూరు,మేజర్‌న్యూస్ :** సమాజ సేవయే పరమావధిగా వాసవి క్లబ్ పనిచేస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేషన్ వైస్ ప్రెసిడెంట్ దర్శి శ్రీనివాస్ గుప్తా అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కొవ్వూరు శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని కొవ్వూరు ఆర్యవైశ్య కళ్యాణమండపం లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. కొవ్వూరు వాసవి క్లబ్ అధ్యక్షునిగా మన్యం వీరభద్ర గుప్తా, కార్యదర్శిగా సత్యవరపు గురునాథ్, కోశాధికారిగా సత్యవరపు భరత్ కుమార్, గౌరవ అధ్యక్షులుగా దేవతు కృష్ణ ప్రసాద్ లచే వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ చలగంట్ల ఎన్ వి ఎస్ ఎస్ ప్రసాద్ ప్రమాణస్వీకారం చేయించారు.ఈ సందర్భంగా వాసవి క్లబ్ నూతన అధ్యక్షులు మన్యం వీరభద్ర గుప్తా మాట్లాడుతూ సమాజంలో అవసరాలను గుర్తించి సహాయ సహకారాలు అందించడంలో నిరంతరం కృషి చేస్తానని అన్నారు. సేవయే పరమావధిగా పనిచేస్తూ క్లబ్ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ వలివేటి ఎల్ ఎన్ వి ప్రసాద్, క్యాబినెట్ సెక్రటరీ ఎస్ వి .చలపతిరావు, క్యాబినెట్ ట్రెజరర్ చల్లగంట్ల వెంకటేశ్వరరావు, వయసు గవర్నర్ కేదార శెట్టి రవికుమార్, డిస్టిక్ ఇన్చార్జి గ్రంధి గంగాధర ప్రవీణ్, రీజియన్ చైర్మన్



ఆలపాటి అచ్యుత లక్ష్మి, జోన్ చైర్మన్ కాకి అనిల్ సూర్య, కొవ్వూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మట్టే వీర వెంకట ప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్ కోశాధికారి తుమ్మలపల్లి రమేష్ కుమార్, ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు మద్దుల సత్యనారాయణ,కక్కిరాల సోమయ్య, వంకాయల శివరామకృష్ణ, బంగారు కాశి అన్నపూర్ణ,మద్దుల నాగమణి, తదితర ఆర్యవైశ్య సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రంగుల కలగా రాష్ట్ర ప్రభుత్వ విజన్ 2047 ప్రణాళిక

**- ఆర్థిక పరిస్థితి పేరుతో ఎన్నికల హామీలు**

**- పథకాలకు చంద్రబాబు తిలోదకాలు**

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శ**

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉట్టికి ఎగరలేనమ్మ.. ఆకాశానికి ఎగురుతాను అన్నట్లుగా కూటమి ప్రభుత్వం విజన్ 2047 ప్రణాళిక ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం విమర్శించారు. మరోవైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనే పేరుతో ఎన్నికలలో ఇచ్చిన హామీలు - పథకాల అమలకు తిలోదకాలు ఇచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం ఏలూరు ఉద్దరాజు రామం భవనంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ప్రజా సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంతెన సీతారాం మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయలేం అని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని, సంపద సృష్టిస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు మాట మార్చి ప్రజలపై భారాలు వేస్తామంటే ఊరుకునేది లేదని ప్రజలు సహించరని చెప్పారు. ఒకవైపు విపరీతంగా పెట్టుబడులు వస్తాయని, రాష్ట్రం స్వర్ణాంధ్రగా మారుతుందని గొప్పలు చెబుతూ మరోవైపు ప్రజలపై భారాలు వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం ఇదేనా స్వర్ణాంధ్ర అని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర కాకుండా అప్పుల ఆంధ్ర ప్రదేశ్ గా మారుస్తున్నారని అన్నారు. కేంద్రం నుండి నిధులు రప్పించి రాష్ట్ర అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అమరావతికి,పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి, నిర్వాసితుల పరిహారం, పునరావాసానికి నిధులు సాధించాలన్నారు. రాష్ట్ర ప్రజలపై పన్నుల భారాలు మోపితే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

- 1/70 చట్ట సవరణ చేయాలంటూ రాష్ట్ర స్పీకర్ వ్యాఖ్యలకు ఖండన - సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం విజన్ 2047 పేరుతో 1/70 చట్టం సవరణ కుట్ర చేయడం ఆదివాసుల హక్కుల హరించడమేనని ఆయన విమర్శించారు.టూరిజం అభివృద్ధి పేరుతో 1/70 చట్ట సవరణ చేయాలని సాక్షాత్తు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ ప్రకటించడం ఆదివాసుల హక్కులు చట్టాలకు తీవ్ర విఘాతం కలిగించేవిధంగా ఉందన్నారు.

భైరవపట్నం అగ్నిప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ఎక్స్ గ్రేషియో చెల్లించాలని, గాయపడిన వారికి పూర్తిస్థాయి వైద్యం ప్రభుత్వం అందించాలని ఆయన కోరారు. ఆక్వా చెరువులను పిట్టల నుండి కాపాడేందుకు కాపలాదారులు ఉండే వీరికి సొంత స్థలాలు కూడా లేవని, కాబట్టి ఆ కుటుంబాలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించి పక్కా ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కోరారు.ఇళ్ళు కాలిపోయిన కుటుంబాలకు నిత్యావసర సరుకులు,తక్షణ సాయం రూ.10వేలు ప్రభుత్వం అందించాలని కోరారు. ఈ సమావేశం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్. వి.డి ప్రసాద్, ఆర్.లింగరాజు,జి.రాజు, ఎం.నాగమణి, కె. శ్రీనివాస్, పి.రామకృష్ణలతో పాటు మండలాల నుండి వచ్చిన నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కుకు ప్యాకేజీ ప్రకటన తాత్కాలిక ఉపశమనమే



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** విశాఖ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం ప్రకటించిన ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనమే అని స్టీల్ ప్లాంట్ రక్షణ సమితి నేతలు రామస్వామి, గుర్రప్ప, మహేష్ తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ జాత రెండో రోజు జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం పాలకొల్లు విచ్చేసింది. జాత ఉద్దేశించి వారు మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ కు పూర్తి రక్షణ కావాలంటే కేంద్ర ప్రభుత్వం వెంటనే సెయిల్ లో విలీనం చేసి సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు కేంద్రాన్ని ఒప్పించి ప్రకటన చేయాలని కోరారు. విశాఖ ఉక్కు కార్మికులకు అండగా ఇంతవరకు ఉన్న రాష్ట్ర ప్రజలు, కార్మికులు, ప్రజాసంఘాలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. జాత ఈనెల 31వ తేదీన సిపిఎం రాష్ట్ర మహాసభ లకు హాజరు కానుంది. తమ డిమాండ్ సాధించేవరకు పోరాటం కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. జాత పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్‌కు వచ్చినప్పుడు సిపిఎం నేతలు ప్రజలు గట్టి మద్దతు ఇచ్చారు. స్టీల్ ప్లాంట్ అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నేతలు పుచ్చలపల్లి సుందరయ్య,డా అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోపాలన్, కవురు పెద్దిరాజు,తానేటి బాలరాజు, జవ్వాది శ్రీనివాస్,బాతిరెడ్డి జార్జి, ముచ్చర్ల త్రిమూర్తులు,యర్రా అజయ్ కుమార్, గూడూరి నాగేశ్వరరావు, పురుషోత్తం, నీలకంఠం, పుగాకు పూర్ణ, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి రామ భద్రం పాల్గొన్నారు.

# మంచినీటిని జాగ్రత్తగా వాడుకోకపోతే తీవ్ర ఇబ్బందులు



**ఏలూరు,మేజర్ న్యూస్:** నగర ప్రజలకు 40 రోజులకు సరిపడా మంచినీరు నిల్వ ఉందని రానున్న వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రజలు మంచినీటిని జాగ్రత్తగా వాడుకోవాలని లేని పక్షంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ ఎమ్ ఆర్ పెదబాబు నగర ప్రజలను కోరారు. రానున్న వేసవికాలంలో ఎండలు తీవ్రంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు,రాష్ట్ర ప్రభుత్వం ముందుగా తెలియజేశారు అన్నారు. ముందస్తుగా ప్రభుత్వం ఇచ్చిన సంకేతాలను దృష్టిలో పెట్టుకొని శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి),నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆదేశాల మేరకు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎం ఆర్ పెదబాబు బుధవారం ఉదయం మున్సిపల్,అధికారులు కార్పొరేటర్ల బృందంతో కలిసి దెందులూరులో ఉన్న గోదావరి జలాల సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. అక్కడ పరిస్థితులు చూసి సుమారు 40 రోజుల వరకు సరిపడా గోదావరి జలాలు ట్యాంకులో ఉన్నాయని ఎస్ ఎం ఆర్ పెదబాబు అన్నారు. గోదావరి జలాలను పంపింగ్ చేసే 150 హెచ్పి మోటర్ ఎక్కువగా రిపేర్లు రావడం కారణంగా గోదావరి జలాలను చెరువులోకి పూర్తిస్థాయిలో పంపింగ్ చేయలేక పోతున్నామన్నారు. అయితే ఆమోటార్ స్థానంలో తక్షణమే 50 హెచ్ పి మోటార్లను బిగించి గోదావరి జలాలను పంపించేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎం.ఈ సురేంద్రబాబు, డి.ఈ లు రజాక్, తాతబ్బాయి,ఎలక్ట్రికల్ ఏ.ఈ సాంబశివరావు, కార్పొరేటర్లు జున్నూరు కనక నరసింహారావు, సబ్బన శ్రీనివాసరావు,బత్తిన విజయకుమార్, దేవరకొండ శ్రీనివాసరావు,పాము శామ్యూల్, నున్న కిషోర్,ఇదిపల్లి పవన్,చలువాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు...

# విద్యను బలోపేతం చేసే దిశగా పాఠశాలల అనుసంధానం

**– చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశం**



**భీమవరం,మేజర్ న్యూస్:** జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం డిఇఓ, ఉండి నియోజకవర్గం మండల విద్యాశాఖ అధికారులతో సమావేశమై పాలకోడేరు,ఆకివీడు, ఉండి, కాళ్ళ మండలాల పరిధిలోని పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై పిపిటి ద్వారా సమీక్షించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించాలన్నారు. బోధనపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి మంచి పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పాలని, అవగాహన కల్పిస్తూ వారిలో స్ఫూర్తినింపాలన్నారు. విద్యార్థులలో సామాజిక అంతరాలు తొలగించడం, ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పాఠశాల ఉండేలా మిళితం చేసే ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గతంలో 6 కేటగిరిలగా విభజించి పాఠశాల విద్యావిధానం కొనసాగిందని, ప్రస్తుతం అంగన్వాడీ, అంగన్వాడీతో కలిపి ఒకటి, రెండు తరగతులు, అంగన్వాడీతో కలిపి ఒకటి నుండి ఐదు తరగతులు, అంగన్వాడీతో కలిపి ఒకటి, రెండు తరగతులు, అంగన్వాడీతో కలిపి ఒకటి నుండి ఐదు తరగతులు మొత్తం 60 మంది పైబడి విద్యార్థులతో మోడల్ స్కూల్ ఏర్పాటుతో పాటు ప్రతి తరగతి ఒక టీచర్ నియామకం, ఉన్నత పాఠశాలను 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఐదు కేటగిరీలలో ఏర్పాటుకు ప్రస్తుత పాఠశాలను విద్యార్థుల సంఖ్య ఆధారంగా పునర్వ్యవస్థీకరణ చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఇ.నారాయణ, కాళ్ళ,ఆకివీడు, పాలకోడేరు, ఉండి, ఎం.ఇ.ఓలు ఎ.రవీంద్ర, వి.వెంకటేశ్వరరావు, వి.సీతారామయ్య, పీవిఎస్.నాగరాజు, ఏం.ఏన్.శ్రీమన్నారాయణ, బి.జ్యోతి, బి.వినాయకుడు, తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య రోజున ఆఖండ అన్నసంతర్పణ



**ఏలూరు,మేజర్ న్యూస్:** అమావాస్య రోజున ఆఖండ అన్నసంతర్పణ జరిగింది. స్థానిక అగ్రహారం శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో ప్రతి అమావాస్య రోజున అఖండ అన్న సమారాధన జరుగుతుందని ఈ నేపథ్యంలో 29 బుధవారం భక్త సమాజము వారి ఆధ్వర్యంలో భారీ అన్న సందర్భంగా జరిపించామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ధన రూపేనా, వస్తు రూపేనా, కాయగూరలు రూపేనా కమిటీ వారికి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ సత్యదేవుని దర్శించుకున్న ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి

**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ఎస్పీఎఫ్ ఐజీ బీవీ రామిరెడ్డి శ్రీ స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, ఏఈఓ దామొర్ల కృష్ణారావు, ఆలయ మర్యా దలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా ఏఈఓ కృష్ణారావు శ్రీ స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపర్డెంట్ సుబ్రహ్మణ్యం, జగన్నాథం, టెంపుల్ ఇన్స్పెక్టర్ గణపతి పాల్గొన్నారు.

# దివ్యాంగులకు సాధికారత కల్పించేందుకే ప్రత్యేక జాబ్ మేళా






**– 142 మంది హాజరు కాగా 67 మంది ఎంపిక**

**ఏలూరు,మేజర్ న్యూస్:** దివ్యాంగులకు సాధికారత కల్పించేందుకు, స్వావలంబనను ప్రోత్సహించేందుకు నిర్వహించిన జాబ్ మేళాలో ప్రముఖ సంస్థలు భాగస్వామ్యం కావడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. బుధవారం స్థానిక వైఎటి లో రాష్ట్ర స్కిల్ డెవలప్ మెంట్, డిఆర్డిఏ, జిల్లా ఉపాధిశాఖ, ఎపిఎస్ఎస్ డిసి సంయుక్తంగా విభిన్న ప్రతిభావంతులకు నిర్వహించిన ప్రత్యేక జాబ్ మేళాలో జెడ్పి చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందినవారికి నియామక పత్రాలు అందజేశారు. 142 మంది హాజరు కాగా 67 మంది ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ గత 7 నెలల్లో పిజిఆర్ఎస్‌లో పలువురు దివ్యాంగులు ఉద్యోగాలు, ఇతర ఉపకరణాలు కోరుతూ అర్జీలు అందించడం జరిగిందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకొని దివ్యాంగులకు ప్రత్యేకజాబ్ మేళాను చేపట్టడం జరిగిందన్నారు.ఇది ఆరంభం మాత్రమేనని ఇకపై 6 నెలలకు ఒకసారి జాబ్ మేళాలు నిర్వహించదలచామన్నారు. కేవలం ఉద్యోగాలకే కాకుండా వ్యాపార వేత్తలుగా కాదలిస్తే అందుకు అవసరమైన బ్యాంకు రుణాలు అందిస్తామన్నారు. జిల్లాలో గత ఏడు నెలల్లో 27 జాబ్ మేళాలు నిర్వహించగా వాటిలో 132 వివిధ కంపెనీలు భాగస్వామ్యం అయ్యాయన్నారు. వాటిలో 1592 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ దివ్యాంగులు ఏవిషయంలోను అధైర్యపడోద్దని, నిరాశచెందవద్దని అన్నారు. జాబ్ మేళాలో పాల్గొని తమ ప్రతిభను కనబరచి మంచి ఉద్యోగాలు పొందడం ద్వారా ఉన్నత స్థితికి రావాలని సూచించారు. శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య(చంటి) మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ప్రభుత్వం పెద్దఎత్తుల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. గతంలో ఇటువంటి జాబ్ మేళాలు నిర్వహించి పెద్దఎత్తున ఉపాధి కల్పించిన దాఖలాలు లేవన్నారు. విభిన్న ప్రతిభావంతులు వారి అర్హతమేర ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని ఇందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలపాలన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, సెట్ వెల్ సిఇఓ ప్రభాకరరావు,దివ్యాంగుల సంక్షేమ శాఖ ఎడి రామ్ కుమార్, జిల్లా యువజన అధికారి దూలం కిషోర్, జిల్లా ఉపాధి అధికారి సి. మధుభూషణరావు, తహశీల్దారు శేషగిరి, పలు దివ్యాంగుల సంక్షేమ సంఘ ప్రతినిధులైన వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

# బాలలను దత్తత తీసుకోవడానికి ముందుకు రావాలి




**ఏలూరు,మేజర్ న్యూస్:** మహిళాభివృద్ధి ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శిశు గృహం అనుసంధానంగా ఉన్న బాలసదనంలోని నూకాలమ్మ అలియాస్ మహతి సౌమ్య 12 సం.ల వయస్సు గల పాపను తమిళనాడు రాష్ట్రానికి చెందిన సేలం జిల్లా వాస్తవ్యులైన జనార్ధనన్ కె, సీతాలక్ష్మి ఎం దంపతులకు కారా నియమ నిబంధనల ప్రకారం కేరింగ్స్ పోర్టల్ ద్వారా గత మాసంలో 5వ తేదీన ప్రీ అడాప్షన్ పోస్టర్ కేర్ తీసుకోవడం జరిగింది. వారు పాపతో అనుబంధాన్ని పెంచుకున్న తర్వాత వారు పాప పట్ల అవలంబిస్తున్న పెంపక విధానాలను గమనించి వారికి తుది దత్తత ఉత్తర్వులను కలెక్టర్ వెట్రి సెల్వి బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు పాప యోగక్షేమాలను ఆరా తీసి పాపతో ఉన్న అనుబంధం బాగుందని సంతృప్తి చెందిన తర్వాత తుది దత్తత ఉత్తర్వులను వారే సొంత తల్లిదండ్రులు అని నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విధంగా పెద్దపాపలను అనగా ఐదారు సంవత్సరములు పైబడిన బాలలను దత్తత తీసుకోవడం అనేది శుభపరిణామమని వయసు పెరిగే కొద్దీ తల్లిదండ్రులు లేరు అనే భావనతో బాధపడుతూ వివిధ రకాల హోమ్‌ల లోనే జీవితం కొనసాగిస్తున్న బాలలకు ఈ విధంగా పెద్ద పిల్లల నైనా మేము దత్తత తీసుకుని ఒక కుటుంబమును ఏర్పాటు చేయగలమని ముందుకు రావలసిందిగా పిల్లలు లేని తల్లిదండ్రులు పెద్ద పిల్లలను దత్తత తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ విధంగా దత్తత తీసుకున్న పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పించి వారు ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి శారద ,జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సిహెచ్ సూర్య చక్రవేణి ,శిశు గృహ మేనేజర్ కే భార్గవి పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లు రహదారి భద్రత నియమాలు పాటించాలి





**టీ.నర్సాపురం,మేజర్ న్యూస్:** రహదారి భద్రత మాసోత్సవం సందర్భంగా టీ నర్సాపురంలో ఆటో,ట్రక్ యూనియన్ సమక్షంలో రవాణా శాఖ రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి. జంగారెడ్డిగూడెం సీనియర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఇరువైపులా పాసెంజర్లను కూర్చోబెట్టుకుని ప్రయాణం చేయకూడదని,మద్యం సేవించి వాహనమును నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సూచించారు. వెహికల్ ఇన్స్పెక్టర్. వై సురేష్ బాబు మాట్లాడుతూ సెల్ ఫోన్ మాట్లాడుతూ ఆటో నడపరాదని అతివేగం ప్రమాదకరమని రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానం చేరాలని సూచించారు.

టీ నర్సాపురం ఏ ఎస్ఐ జయ కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ , సీట్ బెల్ట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు,ఓనర్లు,ట్రక్ డ్రైవర్లు,ఓనర్లు పాల్గొన్నారు.